క్లుప్తంగా

5న గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణం

ఫిరంగిపురం: గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ 21వ వార్షికోత్సవం ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు తిరుపతమ్మ దేవస్థానం పాలకవర్గ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివార్లకు సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు, పుష్పార్చన, యాగశాలలో లక్ష్మీగణపతి హోమం, మధ్యాహ్నం కుంకుమార్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేస్తారని చెప్పారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రధాన అర్చకులు వెలగలేటి పూర్ణనాగసాయిచారి ఆధ్వర్యంలో శాంతి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మేరీమాత గ్రామోత్సవం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలో నూతక్కి విచారణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మేరీమాత గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విచారణ గురువులు ఫాదర్ మంద ఆంథోని ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఫాదర్ కసిరెడ్డి జోసఫ్, ఫాదర్ రవీంద్ర, ఫాదర్ యోగానంద దివ్య బలిపూజ నిర్వహించారు. సంఘస్తులు, సంఘ పెద్దలు, విన్సెంట్ డి.పాల్ సభ్యులు, దళ సభ్యులు తదితరులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

వైద్యరంగంలో మార్పులను అందిపుచ్చుకోవాలి



మంగళగిరి: ప్రస్తుత వైద్య రంగంలో వస్తున్న మార్పులను యువ వైద్యులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని డాక్టర్ మంజుల పేర్కొన్నారు. నగర పరిధిలోని చినకాకాని ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ఆదివారం ల్యాప్ వింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ వైద్యరంగంలో అనేక మార్పులు వచ్చాయని వివరించారు. గైనకాలజీ విభాగానికి సంబంధించి లైవ్ ల్యాప్రోస్కోపీ నిర్వహించి వైద్యులకు వివరించారు. కార్యక్రమంలో గైనకాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ ప్రభాదేవి, డాక్టర్లు గంగాధరరావు, కుమార్ చౌదరి, ఉమ, రామలింగం, మౌనిక, సునీత తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయం



మంగళగిరి: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న మానవ సేవా సంస్థ కార్యక్రమాలు అభినందనీయమని పట్టణ సీఐ బి.అంకమ్మరావు కొనియాడారు. ఆదివారం నగరంలోని ఓ పాఠశాల ఆవరణలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. 700 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ వంగర సురేష్‌కుమార్, డాక్టర్లు అజయ్, వంశీ, చక్రవర్తి, ఆరాధ్య, భాషాలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా సంస్థ ప్రతినిధులు ఆది నారాయణ, రమేష్, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మంగళగిరి విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి: కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో మంగళగిరి విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ డి.ప్రభాకర్ తెలిపారు. బాలికల అండర్ –12 విభాగంలో భవ్యశ్రీ బృందం బంగారు పతకం, అండర్ –11 విభాగంలో అస్మిత రజిత పతకాన్ని సాధించారని వెల్లడించారు. బాలుర అండర్ –9 విభాగంలో దినేష్ బంగారు పతకం, హర్షవర్ధన్ కాంస్య పతకం, అండర్– 10 విభాగంలో ఆదిత్య శ్రీరామ్ రజిత పతకం సాధించారని వివరించారు. వీరిని ఎంఎంకే స్టేడియం ప్రతినిధులు అభినందించినట్లు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం

గుంటూరు వెస్ట్: యువజన సర్వీసుల శాఖ స్టెప్, వీఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్, ఆపద్బంధు సర్వీస్ సొసైటీ సంయుక్తంగా ఆదివారం స్థానిక బీఆర్ స్టేడియంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. 80 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమ చైర్మన్ ఎస్.అయ్యప్ప మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో విలువైన ప్రాణాలు కాపాడవచ్చన్నారు.

మంగళగిరి గడ్డ.. వైఎస్సార్ సీపీ అడ్డా

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్లు ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్
- మంగళగిరిలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం
- భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడున్నరేళ్లలో మంగళగిరి నియోజకవర్గంలో అమలైన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఈ ప్రాంతం వైఎస్సార్ సీపీ అడ్డాగా మారిందని ఆ పార్టీ గుంటూరు, కృష్ణా జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని తెనాలి రోడ్డు మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధ్యక్షతన జరిగిన సమావేశానికి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారని, అవినీతి రహితంగా పథకాలను ఇంటింటికీ అందిస్తున్నారని వివరించారు. మరో 30 ఏళ్లు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలోనూ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, ప్రజల్లోకి వెళ్లి సంక్షేమ పాలన గురించి వివరించాలని సూచించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ అండగా నిలుస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని పేర్కొన్నారు.

బాధ్యత కార్యకర్తలదే..

మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. 2024లో మళ్లీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. నీతి, నిజాయితీతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్న ఎమ్మెల్యే ఆర్కే 2024లో హ్యాట్రిక్ కొట్టి ఎమ్మెల్యే కాబోతున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పని తక్కువ ప్రచారార్భాటం ఎక్కువ అని విమర్శించారు.

రూ.800 కోట్ల మేర సంక్షేమం..
రూ.300 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా రూ.800 కోట్లకుపైగా ప్రయోజనం పొందారని వివరించారు. దీనికితోడు రూ. 300 కోట్లతో నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని కొనియాడారు. అందుకే గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి కళ్లెదుట కనిపిస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సాధించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గత టీడీపీ పాలనలో నియోజకవర్గంలో నివాసం ఉన్న మాజీ సీఎం చంద్రబాబుకు, మూడు శాఖల మంత్రిగా పనిచేసిన లోకేష్‌కు ఏ ఒక్క గ్రామంలోనైనా ఒక్క అభివృద్ధి పని చేశామని చెప్పుకునే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. లోకేష్ నాలుగు వేల కిలో మీటర్లు కాదు కదా 40 వేల కిలోమీటర్లు పొర్లుదండాలు పెట్టినా రాష్ట్రంలో టీడీపీ ఓటమి తప్పదని స్పష్టం చేశారు. మంగళగిరి వైఎస్సార్ సీపీ కంచుకోటగా మారిందని తేల్చిచెప్పారు.

పేదల కోసం పాటుపడుతున్న సీఎం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, విద్య, వైద్యంతో పేదల జీవన స్థితిగతులు మెరుగు పడుతున్నాయన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలు, పూలమాలలతో వక్తలను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, మంగళగిరి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ, మండల కన్వీనర్లు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, పాటిబండ్ల కృష్ణమూర్తి, పార్టీ మహిళా విభాగం కన్వీనర్లు సంకె సునీత, సంపూర్ణ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం ఆదివారం ఎన్నికైనట్లు అసోసియేషన్ అధ్యక్షులు వి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు సమక్షంలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో వెలగపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా, మందపాటి లక్ష్మీ నరసరాజు కార్యదర్శిగా, లింగిపిల్లి రామకృష్ణ ఉపాధ్యక్షులుగా, వీసం వెంకట సుబ్బారావు కోశాధికారిగా, డాక్టర్ ఓబుల్‌రెడ్డి సహాయ కార్యదర్శిగా, గోపాళం సాంబశివరావు, సిహెచ్ ఎల్ నరసింహారావు, కర్రి సాంబయ్య, సురేష్‌కుమార్, వడిపిన రాము, పి.ప్రభాకర్, కెవి రామయ్య, టి. ఉమామహేశ్వరరెడ్డి, ఎస్.వి. మూర్తి, అమ్మిరెడ్డి రామిరెడ్డి, పులిపాటి శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావులు కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు.

మత్తులో కత్తితో దాడి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబాడీపేటలోని రైల్వేయార్డులో ఆదివారం రాత్రి ఇద్దరు స్నేహితులు మద్యం మత్తులో మునిగి తేలారు. మద్యం ఎక్కువైన తరువాత ఇద్దరి మధ్యా వివాదం చోటుచేసుకుని మాటామాటా పెరిగి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో నాని అనే యువకుడు లక్ష్మణ్ అనే పాత నేరస్తుడిని సీసాతో పొడవడంతో గాయమైంది. స్థానికంగా ఉన్నవారు వెంటనే లక్ష్మణ్‌ను వైద్యం నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో ద్విచక్రవాహనంతో హల్‌చల్

ఐదుగురికి తీవ్ర గాయాలు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉండవల్లి పెనుమాకలో ద్విచక్రవాహనంపై అతివేగంగా తిరుగుతూ పెనుమాక నుంచి ఉండవల్లి వచ్చే రహదారిలో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టారు. రెండు ద్విచక్రవాహనాలపై వెళ్తున్న ముగ్గురిని వెనుక నుండి ఢీ కొట్టడంతో మద్యం మత్తులో ఉన్న ఇద్దరితోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న యువకులను వారి స్నేహితులు చేతులపై మోసుకుంటూ తీసుకెళ్లిపోయారు. గాయపడిన మరో ముగ్గురిని స్థానికులు 108లో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఓ యువతికి మడమ విరిగింది. సమాచారం తెలుసుకున్న తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేసరికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదానికి గురైన మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి క్షతగాత్రుల వివరాల కోసం యత్నిస్తున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మేడికొండూరు: వారంతా 29 ఏళ్ల క్రితం హైస్కూల్ వాతావరణంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు. ప్రస్తుతం వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇప్పుడు మళ్లీ చదువులమ్మ ఒడి చేరి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సందడి చేశారు. మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ఎస్‌జీవీఆర్ హైస్కూల్లో 1993–94లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ కలిసి ఉత్సాహంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులు కొండవీటి రాజేంద్రప్రసాద్, సురేంద్ర, ఖాన్, కోటేశ్వరరావు, ప్రైవేట్ చెప్పిన శాస్త్రి, ఇతర గురువులను ఘనంగా సత్కరించారు. విందు భోజనాలు, ఆటపాటలతో హుషారుగా గడిపారు.

నేటి పరిస్థితులకు అద్దంపట్టే సాహిత్యం రావాలి



జిల్లా శాఖ నూతన కార్యవర్గంతో కలిమిశ్రీ, రమణ యశస్వి తదితరులు

పాత గుంటూరు: నేటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టే సాహిత్యాన్ని అందించాల్సిన బాధ్యత సాహిత్య సంఘాలపై ఉందని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా శాఖ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ, ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రచయిత విడదల సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ పోటీల్లో బహుమతులు, ప్రభుత్వ పురస్కారాల కోసం రచయితలు రచనలు చేయకూడదన్నారు. సినీ గేయ రచయిత వేటూరి జయంతి, గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని విజయగోలి కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా సయ్యద్ జానీ బాష, ఉపాధ్యక్షులుగా కాకరపర్తి సుబ్రహ్మణ్యం, సభ్యులుగా విజయ గోలి, విష్ణు మొలకల భీమేశ్వరప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, కారంచేటి విజయకుమార్, కోట లీలాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధిగా బండికల్లు జమదగ్ని బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకటరమణ, రచయిత్రులు పోగుల విజయశ్రీ, సిహెచ్ సుశీలమ్మ, డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

స్వరమాధురి సంగీత విభావరి వీనుల విందు



సినీ పాటలను ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరమాధురి అధ్యక్షుడు శెట్టి థామస్ ఆధ్వర్యంలో ఆదివారం అలనాటి ఆణిముత్యాలు పేరుతో సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్, పి.కృష్ణారావు, శెట్టి థామస్, మిరియాల ప్రసాదరావు, చీకటి రవికాంత్, దేవదాస్, డాక్టర్ ఫర్ని కుమార్, డాక్టర్ సీవీఎస్ రామకృష్ణ, ఘనశ్యాం, ఆదాం, హేమమాలిని, గాయత్రి సినిమా పాటలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం శ్రీశుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్, డాక్టర్ సీవీఎస్ రామకృష్ణలను ఘనంగా సత్కరించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నగరంపాలెం: బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు అన్నారు. బ్రాడీపేటలోని బ్యాంక్ కార్యాలయ ఆవరణలో ఆదివారం గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ రిటైర్డు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఈఓ కృష్ణవేణి, విశ్రాంత జీఎం పి.శివన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శులు జగన్నాథరెడ్డి, బాలాజీవరప్రసాద్, కోశాధికారి టి.నరసింహారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడారు.

రోడ్డుపై పార్కింగ్.. పగిలిన వాహనాల అద్దాలు



మంగళగిరి: రోడ్డుపై పార్కింగ్ చేసిన పలు వాహనాల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన ఘటన శనివారం రాత్రి జరిగింది. నగరంలోని ప్రధాన రహదారి విస్తరణతో వివిధ కార్పొరేట్ పాఠశాల బస్సులు, కార్ల యజమానులు రాత్రి వేళ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణం చేసే వారు ఇబ్బంది పడుతుండటంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. చిర్రెత్తుకొచ్చిన కొందరు శనివారం అర్ధరాత్రి సమయంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కార్లు, స్కూల్ బస్సులు, ఆటోల అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ఉదయాన్నే గమనించిన యజమానులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు గుంటూరు నగర పాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సోమవారం స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు స్పందన కార్యక్రమం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని.. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చన్నారు.

రేపు అన్న సంతర్పణ మహోత్సవం

పాత గుంటూరు: పాత గుంటూరు కట్టావారివీధిలో వేంచేసియున్న లక్ష్మీ గణపతి, శివ నాగేంద్రస్వామి, లక్ష్మీ తిరుపతమ్మ, తల్లి, గోపయ్యస్వామి వార్ల 41వ అన్న సంతర్పణ మహోత్సవ కార్యక్రమం ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వల్లే సూర్యచంద్రరావు, ఆర్గనైజర్ ఆదూరి శ్రీనివాసరావు, ఆదివారం ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామును 4 గంటలకు పంచామృతాలతో అభిషేకాలు, 6 గంటలకు స్వామివారి ఊరేగింపు, మధ్యాన్నం 12 గంటలకు అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పాత గుంటూరు: ఆదిత్య నగర్ ఒకటో లైనులోని సాయిరాం మందిరం 28వ వార్షికోత్సవాలు పురస్కరించుకొని తిరుమల ఆర్ట్స్ అకాడమీ కళా రత్న డాక్టర్ మహంకాళి సూర్యనారాయణ శర్మ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారులు ఆర్.వైష్ణవి, రేష్మిత, జి.వైష్ణవి, అక్షయ, లిఖిత, నిర్విఘ్న, నందన, యశస్వి, శ్రియ, పద్మ, మోక్షిత గణపతి ప్రార్థన, బ్రహ్మాంజలిలు గోవిందా గోవిందా, పలుకే బంగారమాయెనా, నారాయణతే నమో నమో కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాన్ని మహంకాళి నాగలక్ష్మీ, దేవస్థాన అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కారు అదుపుతప్పి వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదానికి గురైన కారు

నందిగామ: అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన ఆదివారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళగిరికి చెందిన షేక్ సమీర్, టి.వెంకట్రావు ఆదివారం తెల్లవారుజామున మంగళగిరి నుంచి హైదరాబాదుకు కారులో బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు 65వ నంబర్ జాతీయ రహదారిపై నందిగామ మండలం ఐతవరం సమీపానికి వచ్చేసరికి అదుపుతప్పి పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయింది. ఈ ప్రమాదంలో షేక్ సమీర్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకట్రావును హుటాహుటిన నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు.

చిగురు ఆశ్రమానికి రూ.5 లక్షల విరాళం



ఫాదర్ నీలం రత్నకుమార్‌కు విరాళం అందజేస్తున్న నన్నపనేని సదాశివరావు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని చిగురు బాలల ఆశ్రమానికి నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాన్ని చిగురు ఆశ్రమంలోని ఆడిటోరియం ఎయిర్ కండిషన్ చేయడానికి వినియోగించనున్నట్లు, అన్ని శుభకార్యాలు చేసుకునేలా ఈ ఆడిటోరియం రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ ఆడిటోరియం ద్వారా వచ్చే ఆదాయాన్ని సంస్థలో ఉన్న అనాథ, పేద, విద్యార్థుల చదువులకు వినియోగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జోసెఫ్ తంబి, ఫాదర్ అంతయ్య, సంస్థ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్లు తగదు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల సందర్శన సమయంలో వెలుగు చూస్తున్న లోపాలకు కారణంగా చూపిస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పేర్కొన్నారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సంఘ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిమ్మన్న మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలను సందర్శించడాన్ని తాము ఆహ్వానిస్తున్నామని, వెళ్లిన ప్రతిచోట సస్పెండ్ చేయడం తగదని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయిస్తూ, మానసికంగా ఆందోళన చెందేవిధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో అన్ని పుస్తకాలు ఒకేసారి ఇచ్చి ఉంటే, ఈరోజు వర్క్ బుక్కులు దిద్ది ఉండేవారని, అచ్చు పుస్తకాలు ఇచ్చిన నాలుగు మాసాల తర్వాత వర్క్ పుస్తకాలు ఇవ్వడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ సర్వీస్ నిబంధనలు అమలు చేయకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేస్తే, సమస్య పరిష్కారం కాదని వివరించారు. గతంలో ఎంతోమంది ఐఏఎస్ అధికారులు పాఠశాలలు సందర్శించిన సమయంలో మంచి సలహాలు, సూచనలు ఇచ్చే వారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమున్నాయో ముందుగా ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకుని ఆ తరువాత చర్యలు తీసుకుంటే మాకు అభ్యంతరం లేదని, సమస్యలను పట్టించుకోకుండా కేవలం ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడమే ధ్యేయంగా ముందుకెళ్లడం తగదన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు, ప్రధాన కార్యదర్శి చందా నరసింహ రావు ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.